# తల్లిమనసు

నడిమింటి రోహిణి

హాల్లో గడియారం అయిదు గంటలు కొట్టడం పూర్తవకుండానే ఆఫీసు నుండి వచ్చిన మూర్తి ఇంట్లో అడుగుపెట్టేడు.

ఆ సమయంలో భాను శోకమూర్తిలా కూర్చోడం మూర్తికి ఆశ్చర్యం కలిగించింది.

'మళ్ళీ పిల్లలు బాగా పోట్లాడుకున్నారు కాబోలు' అనుకుంటూ -బట్టలు మార్చుకునేందుకు లోపలికి వెళ్ళేడు.

అయిదు నిమిషాలు అనంతరం లోపలి నుండి వచ్చిన మూర్తికి భాను ఇంకా అలా కూర్చోడం కాస్త చిరాకనిపించినా పైకి కనిపించనీకుండా భార్య ప్రక్కన కూర్చుని మెల్లిగా పిల్చాడు.

"భాను, ఏం జరిగింది? మళ్ళీ పిల్లలు గొడవేమైనా చేసారా!?" లాలనగా ఆమె భుజంమీద చెయ్యి వేసి.

"హు" అంటూ హుంకరించి భుజంమీద వేసిన భర్త చెయ్యిని విదిలించివేసింది.

తలెత్తిన భార్య ముఖం చూసి ఉలిక్కిపడ్డాడు మూర్తి.

ఎంతసేపైందో ఆమె ఏడుస్తూ మొహం ఉబ్బి కళ్ళు ఎర్ర మందార రసం కళ్ళల్లో పడ్డట్టు ఎర్రబారి ఉన్నాయి.

"ఏమైంది భాను! ప్లీజ్ చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది?

భర్త గొంతులో-లాలిత్యాన్ని భాను గుండెని కరిగించి వేసింది.

ఆమె కళ్ళు సెలఏళ్ళయినాయి.

"చూడు భానూ! నువ్వెందుకు ఏడుస్తున్నావో నాకు తెలుసు. రవి, శివ ఇద్దరూ కొట్టుకుని ఉంటారు. వాళ్ళిద్దరిని నాలుగు బాది బయటికి పంపేసి నువ్విలా ఏడుస్తూ కూర్చున్నావు! అంతేనా!?" అన్నాడు ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

"అవును మీకేం మగ మహారాజులు. అంతేనా! అంటూ ఎంత తేలిగ్గా తీసిపారేశేరు. ఒక్కరోజు శెలవు పెట్టి ఇంట్లో ఉండండి. వాళ్ళ బాధభరించలేక ఒక గంటలోనే ఇంట్లోంచి పారిపోతారు. అందులో శెలవలా యె. స్కూలుంటే కొన్ని గంటలైనా విశ్రాంతి దొరికేది. ఇపుడా.... బాబోయ్. ఇంక నా వల్ల కాదు. ఇంక వాళ్ళిద్దరిని భరించే శక్తి నాకు లేదు" అంటూ ఆగింది. గొంతులో వెక్కిళ్ళు మాటలకి అడ్డొస్తున్నాయి.

"ఊ చెప్పు" అంటూ ఆమె వేపు కవ్వింపుగా చూసేడు.

ఒళ్ళు మండి పోయింది భానుకి.

"ఏమైనా హాస్టల్లో పడేయండి. తిక్క కుదురుతుంది వెధవలకి" అంది.

ఉలిక్కిపడ్డారు మూర్తి.

"వాళ్ళ తిక్క కుదరదు. ముందు మన తిక్క వదిలిపోతుంది" అన్నాడు వెటకారంగా.

"ఏం ఫర్వాలేదు. మనకి ఎప్పుడూ ఉండేవే ఆర్థిక సమస్యలు. మనిద్దరమే కదా! ఏదోలా సర్దుకుందాం. మీరేం చేస్తారో నాకనవసరం. నాకు మనశ్శాంతి కావాలి" అంది ఖచ్చితమైన గొంతుతో.

"చూడు భాను పిల్లలు అల్లరి చెయ్యకపోతే ఎవరు చేస్తారు చెప్పు. మన పిల్లల్ని మనం భరించలేకపోతే పై వాళ్ళకెందుకు బాధ" అన్నాడు నచ్చచెప్తున్న ధోరణిలో మళ్ళీ తనే కొనసాగించేడు మూర్తి.

"నా సంపాదన ఎంతో నాకు తెలుసు. అదైనా నువ్వెంతో నేర్పుతో ఈ సంసారాన్ని చెయ్యబట్టే ఏదో ఇలా సాఫీగా వెళ్ళి పోతున్నాయి రోజులు. ఈ స్థితిలో వాళ్ళని హాస్టల్‌లో చేర్చడం కాదు కదా కనీసం ఆట వస్తువులైనా కొనే స్థాయిలో లేము. ఇంతకన్నా వివరంగా నేను చెప్పనవసరం లేదనుకుంటాను" అనేసి సోఫాలో వెనక్కి వాలి అలసటగా కళ్ళు మూసుకున్నాడు. భర్త గంభీరత్వాన్ని చూసి మీరే మాట్లాడలేక లోపలికి వెళ్ళిపోయింది భాను.

పది నిమిషాలునిశ్శబ్దంగా గడిచిపోయాయి. భాను తెచ్చే కాఫీ కప్పు కోసం ఎదురు చూస్తున్నాడు మూర్తి.

ఇక లాభం లేదునుకుని తనే కిచెన్‌లోకి వెళ్ళి కాఫీ కలుపుకుని తెచ్చుకున్నాడు. కాఫీ తాగడం పూర్తి చేసి ఎటూ తోచక వీధి వరండాలో వచ్చి నిలబడి పిల్లల కోసం ఎదురు చూడసాగేడు.

* * *

"డాడీ, తమ్ముడు పడిపోయేడు" పెద్దగా అరుస్తూ వచ్చేడు శివ.

ఏటో చూస్తున్న మూర్తి పెద్దకొడుకు అరుపుతో గేటువైపు దృష్టి సారించేడు.

ఎవరో అపరిచిత వ్యక్తి తన చిన్నకొడుకు రవిని ఎత్తుకుని వస్తున్నాడు. వాడి నుదిటికి కట్టు. వాడు ఏడుస్తున్న తీరు చూసి గాభరపడుతూ రెండంగల్లో వాళ్లని చేరుకుని కొడుకుని దగ్గరికి తీసుకున్నాడు. వాడు తండ్రిని గట్టిగా అల్లుకుపోయేడు.

"సారీ సర్ చూసుకోలేదు. నా సైకిల్ తగిలి పడిపోయేడు" అన్నాడా అపరిచిత వ్యక్తి క్షమాపణలు కోరుతూ.

"డాడీ అంకుల్‌ని ఏమీ అనకండి. మాదే తప్పు. మేమే రాంగ్ రూట్‌లో నడిచేం" అంటూ మధ్యలో అందుకున్నాడు శివ తన నిజాయితీని ప్రదర్శిస్తూ.

"అరె మీరెందుకు బాధ పడతారు. ఇంకా నయం. అలా వదిలేయకుండా డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళేరు. చాలాథాంక్స్" అంటూ అతని భుజం తట్టేడు మూర్తి.

"ఓకె సరే. ఇదిగో బాబూ నువ్వు ధైర్యంగా నిజం చెప్పినందుకు ఇంద ఈ చాక్లెట్ తీసుకో" అంటూ శివ బుగ్గని ముద్దాడి చాక్లెట్ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడతను.

గేటువేసి పిల్లలిద్దరిని తీసుకుని లోపలికి వచ్చేడు మూర్తి.

బెడ్ రూంలో లైటువేసి రవిని మంచం మీద పడుకోబెట్టేడు మూర్తి.

"మమ్మీ మమ్మీ లే చూడు తమ్ముడికెలా దెబ్బ తగిలిందో"హడావిడిగా వెళ్ళి భానుని కుదపసాగేడు శివ.

ఒక్క ఉదుటున లేచి కూర్చుంది భాను. తటాలున మంచం దిగి పడుకున్న రవి దగ్గరికి వచ్చి కూర్చుంది.

"అరె ఏమైందండీ నా చిట్టి తండ్రికి దెబ్బెలా తగిలింది" అంది నీళ్ళు నిండిన కళ్ళల్లో భర్త వేపు చూస్తూ.

"నే చెప్తానుండు మమ్మీ" డాడీకేం తెలుసు. పాపం ఆ అంకుల్ మంచి వాడే. మేమే రాంగ్ రూట్‌లో నడుస్తున్నాం. సైకిల్ గుద్దేసింది తమ్ముడు పడిపోయేడు' అంటూ యాక్షన్‌తో సహా చేసి చూపెట్టేడు శివ.

"ఇంక చాలుగాని, వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కుని పుస్తకాలు తీసి చదువుకో" మూర్తి కసరడంతో శివ

**ఎవరో అపరిచిత వ్యక్తి తన చిన్న కొడుకు రవిని ఎత్తుకుని వస్తున్నాడు. వాడి నుదిటికి కట్టు. వాడు ఏడుస్తున్న తీరు చూసి గాభరాపడుతూ వాళ్లని చేరుకుని కొడుకుని దగ్గరికి తీసుకున్నాడు. తండ్రిని అల్లుకుపోయేడు.**

అక్కడ నుండి వెళ్ళిపోయేడు.

"భానూ ఇప్పుడే నేనో నిర్ణయం తీసుకున్నాను" అన్నాడు మూర్తి సీరియస్‌గా.

"ఏమిటన్నట్లు" చూసింది భాను మూర్తి వంక.

"నువ్వు చెప్పినట్టుగానే పిల్లల్ని ఈ ఏడాదే ఏదైనా మంచి హాస్టల్ చూసి వేసేద్దాం. ఇక అక్కడేం జరిగినా మనదాకా రాదు. అయినా అక్కడ వాళ్ళు పిల్లల్ని క్రమశిక్షణలో పెంచుతారు కాబట్టి ఇంతగా అల్లరి చెయ్యడం జరగదు. సో మన ప్రాణాలకి హాయిగా ఉంటుంది. కాస్త... డబ్బెక్కువవుతుందన్న మాటేగాని. .." మూర్తి మాట పూర్తికాకముందే భాను అరిచినంత పని చేసింది.

"ఇంక ఆపండి మీ మాటలు. నేనేదో ఆవేశంలో అన్నానని... నిజంగానే చేసేద్దామనుకుంటున్నారా? తల్లి లేని వాళ్ళలా హాస్టల్‌లో వేసే ఖర్మేం వాళ్ళకి పట్టలేదు. పిల్లలన్న తర్వాత వాళ్ళు అల్లరి చేస్తారు. మనం విసుక్కుంటాం. ఇవి సహజం. అంత మాత్రానికే ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం క్షమించరాని నేరం. ఇంకెపుడూ హాస్టల్ మాటెత్తకండి" అంటూ ఏడ్చేసింది భాను.

భార్య మనస్తత్వాన్ని ఎలా అంచనా వేయాలో తెలీక నిట్టూర్చి అక్కడినుండి మౌనంగా బయటకి నడిచేడు మూర్తి.

*

